క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



రేగడిపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

వై.రామవరం: మండలంలోని కె.యర్రగొండ పంచాయతీ రేగడిపాలెం గ్రామంలో శుక్రవారం భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం, కలసపూజ, మండపారాధన హోమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. విగ్రహ దాత రాజు, సర్పంచ్ వెదుళ్ల సత్యనారాయణరెడ్డి, రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ గిరిజన ప్రధాన అర్చకులు ముర్ల రాజారెడ్డి, ఎస్ఎస్ఎఫ్ జిల్లా నేత మడకం వెంకటేశ్వర్లు, మండల ధర్మ ప్రచారక్ కడబాల ఆదివిష్ణు, గ్రామ పూజారి కురసం గంగరాజు, వనవాసి కళ్యాణ ఆశ్రమం ప్రతినిధులు, గ్రామపెద్దలు నరసింహమూర్తి, ముర్ల రాజారెడ్డి తదితలు భక్తులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత అనిల్

ఎటపాక: మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన గుండి దీపిక కోతుగుట్టలోని ఏపీఆర్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతుంది. అయితే నిరుపేద విద్యార్థిని కావడంతో స్టడీ మెటీరియల్ కొనుక్కునేందుకు ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న నూపా ఫౌండేషన్ అధ్యక్షుడు నూపా అనిల్ ఆ విద్యార్థినికి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో గుండి లక్ష్మణ్, నరేష్ ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



చౌడుపల్లిలో రైతులకు సైకిల్ వీడర్‌లను పంపిణీ చేస్తున్న ఏవో మధుసూదనరావు

చింతపల్లి: గిరిజన రైతాంగానికి తగ్గిన జీఎస్టీ ధరలతో అందుబాటులోకి వచ్చిన వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు అన్నారు. చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో రైతులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంపిణీ చేస్తున్న వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, విత్తనాలు, ఎరువులపై జీఎస్టీ 7 శాతం తగ్గినట్టు చెప్పారు. సైకిల్ వీడర్లు జీఎస్టీ తగ్గింపులో భాగంగా రూ.1000లకే కంపెనీ పంపిణీ చేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు అగ్రికల్చర్ అసిస్టెంట్ శోభన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణానిధి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

అడ్డతీగల: అనిగేరులో వేంచేసిన వనదుర్గాదేవి ఆలయం వద్ద దసరా నవరాత్రులు ముగింపు పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గురువారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అధ్వాన దారితో అవస్థలు



దొరగూడకు వెళ్లే రహదారి దుస్థితి

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి వెళ్లే రహదారి వర్షానికి కోతకు గురైయింది.గత కొన్ని రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి వరద నీరు ఉధృతంగా ప్రవాహించింది. దొరగూడకు వెళ్లే మట్టి రోడ్డు పలు చోట్ల కోట్టుకుపోయింది. దీంతో రాకపోకలు లేక దొరగూడ గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిలో మట్టి కొట్టుకుపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతులు దాటుకొని రాకపోకలు చేసేందుకు గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామానికి రహదారి నిర్మించాలని, రవాణా కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ త్రినాథ్ చెప్పారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఇతర ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అందని బిల్లులు.. తప్పని తిప్పలు

- ఆరు నెలలైనా ఇంకుడు గుంతల పనులకు మంజూరు కాని సొమ్ములు
- లబ్ధిదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



అప్పలరాజుపేటలో ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతను చూపుతున్న మహిళ

రాజవొమ్మంగి: భూగర్భ జలాలను పెంపొందించేందుకు, నీటి వృథాను అరికట్టేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంతల ఏర్పాటును ప్రోత్సహించింది. కాని వాటికి బిల్లులు మంజూరు చేయడంలో మాత్రమ మీనమేషాలు లెక్కిస్తోంది. దీనితో ఈ ఇంగుడు గుంతలు అంటేనే ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికే తవ్విన గుంతల్లో చిన్న పిల్లలు. పశువులు ప్రాణాలపైకి తెచ్చుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజవొమ్మంగి పంచాయతీలోని సూరంపాలెం, అప్పరాజుపేట గ్రామాలకు మంజూరైనా ఇంకుడు గుంతలకు ఆరు నెలలు దాటి పోతున్నా బిల్లులు మంజూరు కాలేదు. ప్రతి ఇంటి ఆవరణలో వాడుకనీరు, వర్షపునీరు చేరేందుకు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఉపాధి వేతన దారులను సూచించారు. ఒక్కో గుంత నిర్మాణానికి మూడు పనిదినాలతో పాటు రూ. 3 వేలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. దీంతో ఈ రెండు పంచాయతీల్లో సుమారు 60 మంది ఇప్పటికే తమ తమ ఇంటి ముందు ఇంకుడు గుంతలు తవ్వుకొని, వాటి కోసం సిమెంటు, సిమ్మెంట్ తూరలు కూడా సిద్ధం చేసుకొన్నారు. కాగా ఇంకుడు గుంతల ఏర్పాటుకు తవ్విన గోయ్యిలు ఇంటి ఆవరణలో, గ్రామం మధ్యలో ప్రమాదకరంగా మారాయని లబ్ధిదారులు చెబుతున్నారు. కొంత మంది కొనుగోలు చేసి తెచ్చిన సిమెంట్ గడ్డకట్టి పాడైపోతుందన్న ఆలోచనతో సొంత ఖర్చులతో తూరలు కొనుగోలు చేసుకొని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొన్నారు. ఇందుకు రూ. 2,500 వందల వరకు ఖర్చు అయినట్లు చెపుతున్నారు. ఇదిలా ఉండగా ఇంకుడు గుంతలు ఏర్పాటుపై అధికారులు, సంబంధిత ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు బిల్లులు కోసం అడిగితే ముఖం చాటేస్తున్నారని అప్పలరాజుపేటకు చెందిన సేనాపతి లక్ష్మి, చిన్ని రాజుబాబు, రామాయమ్మ తదితరులు వాపోతున్నారు. అప్పు చేసి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొన్నామని తీరా పూర్తయిన తరువాత వాటికి ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకపోవడం ఏమిటని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం

ఈ సమస్యపై స్థానిక ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసరావును వివరణ కోరగా ఇంకుడు గుంతలకు చెందిన సొమ్ములు ప్రభుత్వం నుంచి ఇంకా విడుదల కాలేదన్నారు. మండలానికి వెయ్యి ఇంకుడు గుంతలు మంజూరైనట్టు తెలిపారు. వాటిలో సుమారు 500 పూర్తయినట్లు చెప్పారు. కాగా ఇప్పటి వరకు జరిగిన పనులను రికార్డు చేయాల్సి ఉందన్నారు. పనులు ఎంత వరకు పూర్తయ్యాయో చూసి ఎంబుక్ రికార్డు చేసి బిల్లులకు ప్రతిపాదనలు పెడతామన్నారు.

అప్పచేసి నిర్మించుకున్నాం



ప్రతి ఇంటి ముంగిట ఇంకుడు గుంత తవ్వుకోవాలని అధికారులు చెప్పడంతో వడ్డీకి అప్పు చేసి మరీ దీనిని ఏర్పాటు చేసుకొన్నాను. నాకు రూ. 2,500 అయ్యింది. ఇప్పటివరకు వడ్డీలు చెల్లిస్తున్నారు. నెలల గడిచినా బిల్లులు మంజూరు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన బిల్లులు మంజూరు చేయాలి. – సేనాపతి లక్ష్మి, అప్పలరాజుపేట, రాజవొమ్మంగి

అర్థికస్థితి సహకరించకపోయినా..



నా ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా అధికారుల ఒత్తిడితో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకొన్నాను. బిల్లులు గురించి అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు, మరోసారి వారి మాట ఎలా నమ్మేది. బిల్లులు త్వరగా అందేలా అధికారులు చూడాలి. – చిన్ని రామాయమ్మ, అప్పలరాజుపేట గిరిజన మహిళ

ఇంద్రకీలాద్రికి తరలివెళ్లిన భవానీ మాలధారులు



సీలేరు నుంచి విజయవాడ బయలుదేరిన భవానీ మాలధారులు

సీలేరు: విజయవాడలోని కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకునేందుకు భవానీ మాలధారులు సీలేరు నుంచి శుక్రవారం బయలుదేరారు. అమ్మవారి దీక్ష ప్రారంభించి 21 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పీఠం పూజలు నిర్వహించారు. అనంతరం నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు చేపట్టి సుమారు 50 మంది మహిళలతో చిన్న పిల్లలతో సహా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇరుముడితో బయలుదేరారు. మార్గమధ్యలో భద్రాచలం పెద్దమ్మతల్లి చిన్న తిరుపతి వంటి ఆలయాలను దర్శించుకుని దుర్గమ్మ వద్దకు వెళ్తామని గురు భవానీ సన్యాసిరావు తెలిపారు. గ్రామంలో ఆలయాలను భవానీ భక్తులు దర్శించుకున్నారు.

బీమాతో ఆర్థిక భరోసా



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది

పెదబయలు: స్టేట్ బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతీ ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం చేరడంతో అత్యవసర వేళ ఆర్థిక భరోసా కలుగుతుందని పెదబయలు స్టేట్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. పెదబయలు స్టేట్ బ్యాంకులో బ్యాంకు ఖాతాదారుడై, పీఎంజేజేబీవై లబ్ధిదారుడు సీతగుంట గ్రామానికి చెందిన వండలేబు ఇంద్రకుమారి మృతి చెందడంతో ఆయన నామినీ రామలింగంకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. అలాగే పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ మెట్టగుడ గ్రామానికి చెందిన వంతాల రామి మృతి చెందడంతో ఆమె నామినీ వంతాల చంద్రుకు రూ.2లక్షల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన పీఎంజేజేబీవై లైఫ్ ఇన్సూరెన్స్ పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకంపై అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది ఎస్ఎస్ షణ్ముఖ్ హరి, సీఎస్‌పీ జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల కమిటీ అధ్యక్షుడు లోవప్రసాద్

రాజవొమ్మంగి: డీఎస్సీ ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం వంద శాతం ఉద్యోగాలు మీకే అని హామీ ఇచ్చి మోసగించారని ఆదివాసీ హక్కులు ఉద్యోగ సాధన కమిటి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం రాజవొమ్మంగిలో సమావేశమైన నాయకులు మాట్లాడుతు ఈ అంశంపై గతంలో అనేక సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు గత నెల 19న రంపచోడవరం ఐటీడీఏ పీవోకు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి వీడాలన్నారు. నిరుద్యోగ ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. ఈనెల 13వ తేదీలోగా డీఎస్సీపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాలని, లేనిపక్షంలో ఆదివాసీల ఆగ్రహానికి గురి కాక తప్పదని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కమిటీ సభ్యులు లోవప్రసాద్, బాలకృష్ణ, మల్లిరెడ్డి, వరప్రసాద్, వెంకటరమణ, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు అభినందనలు



అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను సన్మానిస్తున్న ఎంపీ డాక్టర్ తనుజారాణి, నాయకులు

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియామకమైన అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా శుక్రవారం అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణితో పాటు వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సిహెచ్ మల్లేష్ ఇతర నాయకులతో కలిసి ఆయన నివాసం వద్దకు వెళ్లి శుభకాంక్షలు తెలిని, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ పార్టీ పట్ల విధేయులై ఉన్నప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు, జిల్లా ఇన్‌చార్జి కురసాల కన్నబాబుకు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటసీమ, అడ్డుమండ సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, గుమ్మ శ్యామ్‌సుందర్, నాయకులు మోహన్, జి.చిరంజీవి, సింహాచలం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గణపతి, మాజీ ఎంపీటీసీ మహదేవ్ తదితరులున్నారు.

జాతిపితకు ఘన నివాళి



కంద్రమ్‌లో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు



అడ్డతీగలలో గాంధీజీ విగ్రహం,లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ/అడ్డతీగల: డుంబ్రిగుడ మండల కంద్రుమ్ పంచాయతీ కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికి శాంతి మార్గంలో బాటలు వేసిన మహనీయుడు బాపూజీ అన్నారు. బాపూ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు లచ్చన్న, దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమాన్ని అడ్డతీగలలో ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

గ్రామాల్లో పనులకు శంకుస్థాపన



మొల్లిమెట్లలో అంగన్‌వాడీ భవన పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ కేంద్రంలో పంచాయతీ భవనం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ లక్ష్మణ్ , వివిధ పార్టీల నేతలు పూజలు చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నాయకులు శ్రావణ్‌కుమార్, జగత్‌రాయ్, కామేశ్వరరావు, రామారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని పలు భవన నిర్మాణ పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని కిర్రాబులో పంచాయతీ భవనానికి, మొల్లిమెట్లలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్ బొర్రా బుజ్జమ్మ, సీడీపీవో సుజాత, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఏవో చక్రధర్, ఎంఈవో సూరయ్యరెడ్డి, ఏపీవో శ్రీనివాసరావు, నాయకులు పెద్దిరాజు, సూరిబాబు, లక్ష్మణరావు, తాతారావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

చింతూరు: కూనవరం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెరపాటి రవీంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని, త్వరితగతిన బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

అంబరాన్నంటిన దసరా వేడుకలు



రాజవొమ్మంగిలో దుర్గమ్మ నిమజ్జనంలో భక్తులు



చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

- ఘనంగా విజయదశమి
- భక్తిశ్రద్ధలతో దుర్గదేవికి పూజలు
- గ్రామాల్లో దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనం
- తరలివచ్చిన భక్తులు



మంచంగిపుట్టులో మహిళల కోలాటం



కొయ్యూరులో దుర్గాదేవి విగ్రహ ఊరేగింపులో భక్తులు



రాజవొమ్మంగిలో బోనాల ఊరేగింపు



అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మురుమూరులో అమ్మవారి ఊరేగింపులో భక్తులు

ముంచంగిపుట్టు/పెదబయలు/జి.మాడుగుల/చింతపల్లి/అడ్డతీగల/ఎటపాక/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా గురువారం జరుపుకున్నారు. దుర్గాదేవి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మండపాల్లో దుర్గమ్మ విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భవానీమాలధారులు, భక్తులతో ఆలయాలు కళకళలాడాయి. గ్రామాలన్నీ దుర్గమ్మ నామ స్మరణతో మార్మోగాయి. దుర్గమ్మ విగ్రహాలనూ వాహనాల్లో పురవీధుల్లో ఊరేగించారు. చిన్నారులు, పెద్దలు డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. అనంతరం సమీపంలో గెడ్డలు, జలాల్లో నిమజ్జనం చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. గ్రామాల్లో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయంలో విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర,నరసింహమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పెదబయలు మండల కేంద్రంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జి.మాడుగులలోని సమరసతా సేవా ఫౌండేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దసరా వేడుకలు జరిగాయి. చింతపల్లి మండల కేంద్రంలో భక్తులకు పసుపు, కుంకుమ, గాజులను అందజేశారు. లంబసింగిలో ఎస్ఏఎన్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సూరెడ్డి అప్పలనాయుడు చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో కొలువైన గిరి దుర్గా భవాని అమ్మవారి ఆలయంలో తణుకు వెంకటరామయ్య విజయలక్ష్మి దంపతులు భక్తులచే అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు.ఎటపాకలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాజవొమ్మంగిలో బోనాలను ఊరేగించారు. భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు. దుర్గమ్మ విగ్రహాన్ని వట్టిగెడ్డలో నిమజ్జనం చేశారు.



జి.మాడుగులలో దుర్గమ్మతల్లి విగ్రహం నిమజ్జనంలో భక్తులు



చింతపల్లిలో భక్తులకు పసుపు,కుంకుమలు అందజేస్తున్న పూజారులు



లంబసింగిలో చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న దాత అప్పలనాయుడు

గ్రామాల అభివృద్ధికి సహకారం అవసరం



అడ్డతీగలలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్



జి.మాడుగులలో మాట్లాడుతున్న ఎంపీడీవో దేవిడ్‌రాజ్

అడ్డతీగల: ఆది కర్మ యోగి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ అన్నారు.మండలంలోని గొండోలు సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. 2030 విజన్ ప్లాన్‌లో భాగంగా ఆది కర్మ యోగి పథకంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎంపీడీవో కుమార్ వివరించారు. ప్రజలంతా ఆయా అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక తయారీ, అమలు వంటి అంశాల్లో కీలకభూమిక నిర్వహించాలన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు.

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ డిప్పలగొందిలో శుక్రవారం జరిగిన జన్‌మన్ కార్యక్రమంలో ఎంపీడీవో డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని, ఉపాధిహామీ పథకంలో అందరు భాగస్వామ్యులు కావాలని, వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. గ్రామంలో ఇంటింటికీ సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ తల్లే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.